# అభివృద్ధి పథంలో ఆవిర్భావ స్ఫూర్తి

- అశ్వారావుపేటలో ఘనంగా రాష్ట్ర అవతరణ వేడుకలు
- అమరవీరులకు నివాళులు – అభివృద్ధి పనుల సమీక్ష

**అశ్వారావుపేట, జూన్ 02 (శ్రీ తొలి క్రాంతి):**



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని అశ్వారావుపేటలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరుల స్ఫూర్తితోనే రాష్ట్ర అభివృద్ధి కొనసాగుతోందని పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతులు, విద్య, వైద్యం, సాగునీరు వంటి రంగాల్లో ప్రభుత్వం విశేష అభివృద్ధి సాధిస్తోందని తెలిపారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. యువత పెద్ద సంఖ్యలో రక్తదానంలో పాల్గొనడం అభినందనీయమని, రక్తదానం మహాదానమని ఆయన పేర్కొన్నారు. సమాజ సేవలో యువత ముందుండాలని పిలుపునిచ్చారు.తదుపరి ప్రారంభానికి సిద్ధంగా ఉన్న 100 పడకల నూతన ఆసుపత్రి భవనాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. వార్డులు, వైద్య పరికరాలు, సిబ్బంది అవసరాలు, మౌలిక సదుపాయాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రి ప్రారంభంతో స్థానిక ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జూపల్లి శశికళమ్మ, వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు, జూపల్లి ప్రమోద్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.






# ఆగిపోయిన అభివృద్ధి

- దమ్మపేటలో రోడ్ల పరిశీలన చేసిన మెచ్చా నాగేశ్వరరావు
- కాంగ్రెస్ పాలనపై తీవ్ర విమర్శలు

**దమ్మపేట, జూన్ 02 (శ్రీ తొలి క్రాంతి):**




దమ్మపేట మండలంలో ఆగిపోయిన రోడ్డు పనులు కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు విమర్శించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలంలో నిలిచిపోయిన పలు రోడ్డు పనులను ఆయన స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి వేగంగా సాగిందని, ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో ప్రగతి కుంటుపడిందని ఆరోపించారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన పెండింగ్ పనులను కూడా పూర్తిచేయలేని పరిస్థితి నెలకొందని మండిపడ్డారు. వేదికలపై గొప్పలు చెప్పడం కాకుండా అసంపూర్తి పనులను పూర్తిచేయాలని సూచించారు.మల్లారం రోడ్డు, గాంధీనగర్–మందలపల్లి రోడ్డు, మందలపల్లి సబ్‌స్టేషన్ రోడ్డు, జలవాగు రోడ్డు, పెద్దగొల్లగూడెం–మల్కారం రోడ్డు, గుత్తావారిగూడెం–గంగులగూడెం రోడ్డు వంటి మార్గాలు పనులు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్షణమే పెండింగ్ పనులు పూర్తి చేయకపోతే ప్రజలతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

# అశ్వారావుపేటలో ఎర్ర శిక్షణ

- మూడు రోజుల పాటు సీపీఐ(ఎం) రాజకీయ తరగతులు
- రాష్ట్ర, జిల్లా నాయకుల బోధనలకు ఏర్పాట్లు పూర్తి

**అశ్వారావుపేట, జూన్ 02 (శ్రీ తొలి క్రాంతి):**




సీపీఐ(ఎం) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగతులు జూన్ 3, 4, 5 తేదీలలో అశ్వారావుపేటలోని శ్రీ శ్రీ కళ్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య తెలిపారు.మంగళవారం స్థానిక సుందరయ్య భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. బుధవారం ఉదయం పార్టీ పతాకావిష్కరణతో శిక్షణా తరగతులు ప్రారంభమవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమానికి జిల్లా, మండల కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శులు ప్రతినిధులుగా హాజరవుతారని తెలిపారు.మూడు రోజుల పాటు జరిగే ఈ రాజకీయ శిక్షణా తరగతుల్లో జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులు, హిందూత్వ మతోన్మాదం, సామ్రాజ్యవాద దోపిడీ విధానాలు, కమ్యూనిస్టు విలువలు, పార్టీ నిర్మాణం, కార్యాచరణ వంటి కీలక అంశాలపై రాష్ట్ర, జిల్లా నాయకులు బోధనలు నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరుకానుండగా, రాష్ట్ర కమిటీ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, బండారు రవికుమార్, అబ్బాస్, సీనియర్ నాయకులు పి. సోమయ్య తదితరులు వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు.ప్రతినిధులకు వసతి, భోజన సౌకర్యాలు కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు. సమావేశంలో ఏజే రమేష్, కొక్కెరపాటి పుల్లయ్య, చిరంజీవి, అర్జున్, సోడెం ప్రసాద్, మడకం గోవిందు, మడిపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ప్రమాద బాధిత కుటుంబానికి అండ

- రంగు కోకిల కుటుంబానికి ₹5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేత
- దమ్మపేటలో ఎమ్మెల్యే జారె చేతుల మీదుగా చెక్ పంపిణీ

**దమ్మపేట, జూన్ 02 (శ్రీ తొలి క్రాంతి):**



దమ్మపేట మండల కేంద్రంలోని కార్పెంటర్ కాలనీలో గతంలో విద్యుత్ ప్రమాదంలో అకాల మరణం చెందిన రంగు కోకిల (భాను భార్య) కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన ఐదు లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా చెక్కును ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అందజేశారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మృతురాలి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వం తరఫున కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కక్కిరాల రమేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి, స్థానిక సర్పంచ్ పగడాల రమాదేవి, ఉపసర్పంచ్ ఆంగోత్ శ్రీనివాసరావు, చిన్నశెట్టి యుగంధర్, అన్నవరపు నాగేంద్ర, వార్డు మెంబర్ పోలమ్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి సమస్యలపై లంబాడి హక్కుల పోరాట సమితి ఆగ్రహం

- రాజేష్ నాయక్ అరెస్టుపై తీవ్ర నిరసన
- ఓపెన్ కాస్ట్ బ్లాస్టింగ్ నిలిపివేయాలని డిమాండ్

**సుజాతనగర్, జూన్ 02 (శ్రీ తొలి క్రాంతి):**




సుజాతనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రాజేష్ నాయక్‌ను ముందస్తుగా అరెస్టు చేసి సుమారు 25 గంటల పాటు నిర్బంధించారని సంఘం ఆరోపించింది. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, సమస్యల పరిష్కారం కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రకటించింది.ఓపెన్ కాస్ట్ గనుల్లో పేలుళ్ల వల్ల ఇళ్లకు పగుళ్లు వస్తున్నాయని, పర్యావరణ కాలుష్యం పెరిగి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ విధానాన్ని వెంటనే నిలిపివేసి యంత్రాలతో బొగ్గు తవ్వకాలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభావిత ప్రాంత ప్రజలకు ఆరోగ్య కార్డులు ఇచ్చి ఉచిత వైద్య సేవలు అందించాలని, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు.సమస్యలు పరిష్కరించకపోతే హైదరాబాద్‌లోని సింగరేణి సంస్థ ప్రధాన కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

# బడిబాటపై కొత్త చూపు

- కొత్త డీఈవోగా వాసంతి బాధ్యతల స్వీకరణ
- పాఠశాలల పర్యవేక్షణపై విద్యాశాఖలో కొత్త ఆశలు

**కొత్తగూడెం, జూన్ 02 (శ్రీ తొలి క్రాంతి):**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యాశాఖలో కొత్త అధ్యాయం ప్రారంభమైంది. జిల్లా నూతన విద్యాశాఖ అధికారిగా (డీఈవో) వాసంతి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, సిబ్బంది ఆత్మీయ స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.బడిబాట కార్యక్రమాలు కొనసాగుతున్న వేళ కొత్త డీఈవో బాధ్యతలు చేపట్టడం జిల్లాలోని ఉపాధ్యాయులు, విద్యార్థుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఎప్పుడైనా పాఠశాలలను సందర్శించే అవకాశం ఉండటంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, హాజరు, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పడనుందనే చర్చ సాగుతోంది.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపు, బోధన నాణ్యత మెరుగుదల, పాఠశాలల పరిశుభ్రత, మధ్యాహ్న భోజన పథకం అమలు వంటి అంశాలపై కఠిన పర్యవేక్షణ ఉండొచ్చని విద్యాశాఖ వర్గాలు భావిస్తున్నాయి. కార్యక్రమంలో శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నకిలీలకు చెక్ వేయాలి

- రైతులకు నాణ్యమైన విత్తనాలు ఇవ్వాలి
- సబ్సిడీపై ఎరువులు అందించాలని డిమాండ్

**అశ్వారావుపేట, జూన్ 02 (శ్రీ తొలి క్రాంతి):**




అశ్వారావుపేట మండలం బచ్చువారిగూడెం పంచాయతీ పరిధిలోని ప్రాజెక్టు, రేగడిగుంపు గ్రామాల్లో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో నాయకులు మాట్లాడుతూ రైతులకు కల్తీ లేని నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు అందించాలని డిమాండ్ చేశారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో సబ్సిడీపై విత్తనాలు వెంటనే సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో గోకినపల్లి ప్రభాకర్, వాసం బుచ్చిరాజు, కంగాల చిన్న వంగరావు తదితరులు పాల్గొన్నారు.

# గులాబీ జోష్

- అశ్వారావుపేటలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు
- అమరవీరులకు నివాళులతో మెచ్చా జెండా ఆవిష్కరణ

**అశ్వారావుపేట, జూన్ 02 (శ్రీ తొలి క్రాంతి):**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని అశ్వారావుపేటలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. రింగ్ రోడ్డు సెంటర్‌లోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు పాల్గొని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ శ్రద్ధాంజలి ఘటించారు.అనంతరం జాతీయ జెండాతో పాటు పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలతో కలిసి మెచ్చా నాగేశ్వరరావు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ వేడుకల్లో సందడి నింపారు. గులాబీ జెండాలతో ప్రాంతం మొత్తం పండుగ వాతావరణాన్ని తలపించింది.ఈ సందర్భంగా మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ సాధన కోసం జరిగిన ఉద్యమాన్ని గుర్తు చేసుకున్నారు. బీఆర్ఎస్ పాలనలో గత పదేళ్లలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణ ప్రజల ఆశయాలను కాపాడేది గులాబీ జెండానేనని, మళ్లీ కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రానికి పాత వైభవం తీసుకురావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కోటగిరి సీతారామస్వామి, జూపల్లి రమణరావు, మాజీ వైస్ ఎంపీపీ మందపాటి రాజమోహన్ రెడ్డి, యూఎస్ ప్రకాశ్‌రావు, కాసాని నాగశేష పద్మ (చంద్రమోహన్), సంక ప్రసాద్, కౌన్సిలర్లు రవి, డాక్టర్ భూక్యా జ్యోతి (ప్రసాద్), మాజీ జెడ్పీటీసీ సున్నం నాగమణి, జుజ్జూరపు శ్రీరామ్‌మూర్తి, గొడవర్తి వెంకటేశ్వరరావు, సత్యవరపు సంపూర్ణ, సాధు జ్యోత్స్న, యేలేటి పార్వతి, రఘురాం, ఆరేపల్లి సౌజన్య (గోవింద్), తగరం జగన్నాథం, జిల్ల శ్రీదేవి, సంకుల స్వరూప, మండవ సత్య, మోటూరి మోహన్, జక్కుల రాంబాబు, ఉస్మాన్, రఫీ, తుంపాటి రమేష్, ఆరేపల్లి రాంబాబు, గంగాధర్, వెంకన్న, ధర్మ, ప్రదీప్, భార్గవ్, రహీమ్, జానకి రామ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# గులాబీ జెండా గర్వం

- తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో బీఆర్ఎస్, టీబీజీకేఎస్ సందడి
- అమరవీరులకు నివాళులతో ఘనంగా జెండా ఆవిష్కరణలు

**కొత్తగూడెం, జూన్ 02 (శ్రీ తొలి క్రాంతి):**



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని బీఆర్ఎస్, టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో టీబీజీకేఎస్ రాష్ట్ర ముఖ్య ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని పలు ప్రాంతాల్లో జెండా ఆవిష్కరణలు చేపట్టారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి మరో ముఖ్య అతిథిగా హాజరయ్యారు.గడప రాజయ్య, తుమ్మ శ్రీనివాస్ వైస్ ప్రెసిడెంట్ల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలు ఉత్సాహభరితంగా సాగాయి. పీవీకే ఫైవ్ షాఫ్ట్, ఆనందఖని జంక్షన్ అఫ్‌లోడింగ్ ప్రాంతం, రామవరం టీబీజీకేఎస్ కార్యాలయం, కార్పొరేట్ ఏరియా టీబీజీకేఎస్ కార్యాలయాల్లో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం హెడ్ ఆఫీస్ ఎదుట ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి, ప్రగతి మైదానంలోని అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నాయకులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాపు కృష్ణ మాట్లాడుతూ.. సమైక్య రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతంపై జరిగిన అన్యాయాలు, అణచివేతలు, నీళ్లు–నిధులు–నియామకాల దోపిడిపై కేసీఆర్ ఉద్యమం ప్రారంభించారని పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ సాధనే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర సమితిని స్థాపించి 14 ఏళ్లపాటు నిరంతర పోరాటం చేసి రాష్ట్రాన్ని సాధించారని గుర్తుచేశారు.రాష్ట్ర ఏర్పాటుకు అనంతరం పదేళ్లపాటు బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని, ముఖ్యంగా సింగరేణి కార్మికులకు అనేక సంక్షేమ పథకాలు, హక్కులు కల్పించారని కొనియాడారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని, మళ్లీ గులాబీ జెండా ఎగిరే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమాల్లో సీసీఎం మహేందర్, పిట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, సూరజ్, ఆంజనేయులు, సూర్యనారాయణ, జయపాల్, రాంబాబు, అరుణ్, బొట్ల స్వామి, అమరేందర్, హైమద్, బాలాజీ, గడప రాజేష్, సంతోష్, రంజిత్, దినేష్, విక్రమ్, రాజేష్, ఖాజా, పూర్ణ, షణ్ముఖ్, యాకుబ్ పాషా, నరేందర్, అమన్, షోయబ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

